## పకడ్బందీగా గ్రామాల వివరాల నమోదు

**ఎంపీవో షేక్ సుష్మా**



పంచాయతీల వివరాలను నమోదు చేయిస్తున్న ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు

పెద్దేముల్, మార్చి 21 : మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలకు సంబంధించిన వివరాలను పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ) వెబ్‌సైట్‌లో థీమ్స్ వారీగా పకడ్బందీగా పొందుపరచడం జరుగుతున్నదని మండల ఎంపీవో షేక్ సుష్మా తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కంప్యూటర్ ఆపరేటర్లతో గ్రామ పంచాయతీలవారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మండలంలోని మొత్తం 37 గ్రామ పంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలను 9 థీమ్స్ వారీగా అనగా 1.వ్యవసాయ శాఖకు సంబంధించి, 2. సివిల్ సప్లై (రేషన్ కార్డులు), 3. శిశుసంక్షేమశాఖ 4. హౌసింగ్ 5. పాఠశాల వివరాలు 6.గ్రామాల పొదుపు సంఘాల వివరాలు 7.పోలీస్‌స్టేషన్ కేసులు 8. ఆరోగ్య శాఖకు సంబంధించిన వివరాలు 9. మిషన్ భగీరథకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు గ్రామ పంచాయతీ వివరాలను పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (పీడీఐ)లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సుమారు 15 నుంచి 20 గ్రామ పంచాయతీల వివరాలు పూర్తిచేయడం జరిగిందని, మిగతా గ్రామ పంచాయతీలను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. వెబ్‌సైట్‌లో థీమ్స్ వారీగా ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నలకు జవాబులను నమోదు చేస్తూ 9 థీమ్స్‌వారీగా గ్రామ పంచాయతీలవారీగా వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ పూర్తైన తరువాత ఉత్తమంగా అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు పీడీఐలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు కూడా రావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేశ్, శ్రావణ్‌కుమార్, రమేశ్, కృష్ణ, మహేశ్ గౌడ్, గోపాల్, యశ్వంత్, ఆనంద్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలి

మర్పల్లి, మార్చి 23 : ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలో మంచి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లలితారమేశ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నాటికి గ్రామాలు, వ్యవసాయ పొలాల్లో ఎక్కడైనా లూఫ్ వైర్లు ఉంటే వాటిని సరిచేయాలని, అవసరం ఉన్నచోట స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎండాకాలం సందర్భంగా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, పశువులకు నీటి తొట్టెల్లో నీళ్లు నింపాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రాజ మల్లయ్య, తహసీల్దార్ గణేశ్, ఎంపీవో సుశీల్‌కుమార్, ఏపీఎం మధుకర్, ఎంపీటీసీలు సంగీతావసంత్, బాల్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మర్పల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితా రమేశ్

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు**

**గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించిన టీచర్లు**



బషీరాబాద్ : పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న టీచర్లు

బషీరాబాద్, మార్చి 23 : తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శనివారం దామర్‌చెడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహార లోపంతో తల్లీబిడ్డల మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని, దీనిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అన్నపూర్ణ, ప్రమీల, లక్ష్మి నర్సమ్మ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



కామునిపల్లిలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న హెల్త్‌సూపర్ వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి

**అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించేందుకు చర్యలు**

కులకచర్ల, మార్చి 23 : చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కృషిచేస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో విద్యార్థుల తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పండరీబాయి ఆధ్వర్యంలో అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వెంకటమ్మ, అనూష, వెంకటయ్య, చిన్నారుల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు హోలీ పండుగను నిర్వహించి రంగులు చల్లుకున్నారు.

## హెచ్‌ఎం, టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

నవాబుపేట, మార్చి 23 : మండల కేంద్రంలోని మాడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్, బైక్‌ను ఢీకొట్టగా, తొమ్మిదవ తరగతి విద్యార్థి కార్తీక్ మృతి చెందిన ఘటన విదితమే. ఈ ఘటనపై చట్టపరంగా విచారణ చేయించి విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీచర్‌కు శిక్ష విధించాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు శనివారం సీఐ ఆంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యుడు రవికుమార్ మాదిగ మాట్లాడుతూ నవాబుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయడానికి పని మనుషులు ఉన్నప్పటికీ ప్రధానోపాధ్యాయుడు, టీచర్లు ఇలాంటి పనులు చేయించడం చట్టరీత్యా నేరమని తెలిసి కూడా తమ బైక్‌లను పిల్లలకు ఇవ్వడం ఏమిటని విమర్శించారు. విద్యా బుద్ధులు నేర్పే టీచర్లు ఇలాంటి పనులు పిల్లలతో చేయించడం సరికాదని మండిపడ్డారు. కార్తీక్ మృతికి కారణమైన హెచ్‌ఎం, క్లాస్ టీచర్లపై చర్యలు తీసుకుంటే మరోసారి ఎక్కడ కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కావని తెలిపారు. సీఐకి వినతి పత్రాన్ని అందజేసిన వారిలో రవికుమార్, కిష్టయ్య, నర్సింహులు, జనార్దన్ ఉన్నారు.

## ఆలయ భూమి కౌలు హక్కుకు వేలం

వికారాబాద్, మార్చి 23 : వికారాబాద్ శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయ భూమిని కౌలు హక్కు పొందుటకు ఏప్రిల్ 2న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్‌రెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ దేవస్థానం భూమి ఆలంపల్లి సర్వే నెం.02 విస్తీర్ణం 2.14 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిని (3)మూడు సంవత్సరాలు అనగా (2024-25, 2025-26, 2026-27) కాలపరిమితి కొరకు కౌలు పొందుటకు హక్కు వేలం పాట మధ్యాహ్నం 12గంటలకు అనంతగిరి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వ్యవసాయ దారులు, రైతులు వేలం పాటలో పాల్గొని వారు ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేయాలన్నారు. డిపాజిట్ తిరిగి వాపసు ఇవ్వబడుతుందని రైతులు, వ్యవసాయదారులు హక్కు వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

**నేడు కరెంటు సరఫరాకు**

## అంతరాయం

పరిగి, మార్చి 23 : మరమ్మతుల వల్ల ఆదివారం పరిగి పట్టణంతోపాటు, మండలంలోని సుల్తాన్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి, రుక్కుంపల్లి, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజీరాబాద్, న్యామత్‌నగర్, మాదారం, పేట మాదారంలతోపాటు పరిశ్రమలకు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ షేక్ ఖాజా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

**ఆన్‌లైన్ మోసాలపై**

## అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పరిగి టౌన్, మార్చి 23 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సంతోష్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 27న 5కే రన్

తాండూరురూరల్ : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలో బుధవారం ఉదయం 6 గంటలకు 5k రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరాచౌక్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ వరకు అక్కడి నుంచి ఇందిరాచౌక్ వరకు 5-k రన్ నిర్వహించనున్నామన్నారు. వంద శాతం పోలింగ్ జరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్నదని తెలిపారు.

## మోదీ నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలి

పరిగి టౌన్, మార్చి 23 : మోదీ నిరంకుశ పాలన విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, తెలంగాణలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడాన్ని చూస్తే ప్రతిపక్షాలను భయభ్రాంతులకు మోదీ ప్రభుత్వం గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అబీబ్, సత్యయ్య, రఘురాం, ఆసిఫ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

## ధ్యానంతో మానసిక ప్రశాంతత



ఉపాధి హామీ కూలీలకు ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ సొసైటీ కార్యదర్శి ఆంజనేయరెడ్డి

దోమ, మార్చి 23 : దిన చర్యలో ధ్యానం చేయడం ఒక భాగం చేసుకోవాలని దాని వల్ల శారీరక మానసిక అలసటలు దూరమై ఉత్సాహవంతులుగా ఉంటారని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని గుండాల, కొత్తపల్లి, మల్లేపల్లి, అనంతరెడ్డిపల్లి, దిర్సంపల్లి గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులకు శనివారం ఆయన ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా తలనొప్పి, క్యాన్సర్ వంటి జబ్బులు తగ్గుతాయని తెలిపారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఎదుర్కొంటున్న షుగర్, బీపీ వంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర ప్రసాద్, వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పిరమిడ్ మాస్టర్లు నవీన్, చెన్నయ్య, విద్యార్థులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను సాధిస్తాం



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కొడంగల్, మార్చి 23 : భగత్‌సింగ్ ఆశయ సాధనలో విద్యార్థులు, యువకులు ముందుకు సాగాలని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్ఎస్‌యూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ 23 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేశారని, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఢిల్లీ నడివీధుల్లో ఎర్ర కాగితాలు పంచుతూ ప్రజల్లో స్వాతంత్ర్యంపై చైతన్యం నింపాడని కొనియాడారు. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ఆర్ఎస్‌యూ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. ఆయన స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విద్యార్థుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశ్, శరత్, విక్కీ, భూమిక, ప్రమీల, అనురాధ, భావన, అనూష, శ్వేత, రమ్య, కావేరి పాల్గొన్నారు.

**భగత్‌సింగ్‌కు నివాళి**

పరిగి టౌన్ : మతం పేరుతో ప్రజలను విడగొట్టే రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. శనివారం పరిగిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

తాండూరురూరల్, మార్చి 23 : పార్లమెంట్ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి నుంచే ఓటు చేసే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. వారు ముందుగా ఫారం 12(డి) నింపి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలు అలాంటి వారికి ఇంటింటికీ వెళ్లి ఓటింగ్‌పై చర్చించాలని సూచించారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఫారం -6 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ బాల్‌రాజ్, సిబ్బంది ఉన్నారు.




బీఎల్ వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

నవాబుపేట, మార్చి 23 : పార్వతీ పరమేశుల బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం త్రయోదశి నాగవెళ్లి కార్యక్రమాలను వేదపండితులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు జాతరకు సంబంధించిన పలు విషయాలు, ఆలయ చరిత్రను భక్తులు కథల రూపంలో వినిపించారు. అనంతరం ఆలయ చైర్మన్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మహా అన్నదానం, ఆలయ ప్రాధాన్యతను కరపత్రాల రూపంలో భక్తులకు వివరించనున్నట్లు తెలిపారు.



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

**SERVICES**

★మీరు కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మేము మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS, L.B.Nagar, Hyd. 7893011777.
NT-311873-All

**LOST**

★I, DERANGULA GANESH, S/o. Late Somaiah, R/o. Mall Village, Yacharam Mandal, R.R. District, TS, have Lost My Original Sale Deed Document No. 5978/2013, S.R.O. at Ibrahimpatnam, RR Dist., while travelling by Bus from Mall to Yacharam. If found anyone, Call: 8074805252.
NT-311875

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## వ్యక్తి అదృశ్యం



హన్మంత్‌రెడ్డి (ఫైల్)

మర్పల్లి, మార్చి 23: వ్యక్తి అదృశ్యమైన ఘటన మర్పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పంచలింగాల్ గ్రామానికి గ్రామానికి చెందిన అన్నం హన్మంత్‌రెడ్డి (76) చెవిటి, మూగ వ్యక్తి కాగా, వ్యవసాయం చేస్తుండేవాడు. ఫిబ్రవరి 27న ఉదయం 10 గంటల సమయంలో పొలానికి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో పొలం వద్ద చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరక లేదు. మన్మంత్‌రెడ్డి మనుమడు మహిపాల్‌రెడ్డి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. హన్మంత్‌రెడ్డి ఆచూకీ తెలిస్తే 7993537461, 9493612605 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

తాండూరు రూరల్, మార్చి 23 : పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసినట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. తాండూరు మండలం, చంద్రవంచ గ్రామ శివారులోని వాగు సమీపంలో ఐదుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అందులో ముగ్గురు వ్యక్తులు పోలీసులకు దొరకగా, ఇద్దరు పరారీ అయ్యారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.11,500 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ



బస్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బీడీ టీమ్ పోలీసులు



బషీరాబాద్ : కారును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

తాండూరు రూరల్, మార్చి 23 : అధిక లోడ్‌తో వెళున్న వాహనాలకు జరిమానా విధించామని తాండూరు మండలం, కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం కరణ్‌కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు వాహనాలను తనిఖీ చేయగా, అధిక లోడ్‌తో వాహనాలను గుర్తించామన్నారు. ఈ వాహనాలను ఆర్టీవోకు అప్పగించగా, రెండు వాహనాలకు రూ.25వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మిగితా నాలుగు వాహనాలకు కూడా జరిమానా విధించినట్లు తెలిపారు.

**చెక్ పోస్టు వద్ద ..**

బషీరాబాద్ : తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహనాలను బషీరాబాద్ తహసీల్దార్ వై. వెంకటేశ్ తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని నవంద్గి, ఇందర్‌చేడ్, మైల్వార్ గ్రామాల వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. శనివారం తహసీల్దార్ నవంద్గి చెక్ పోస్టును సందర్శించి చెక్ పోస్టు గుండా ప్రయాణించే వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టులో ఉన్న వాహనాల ఎంట్రీని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించిన తరువాతనే అనుమతించాలని సిబ్బందికి తెలిపారు.

**రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో బీడీ టీమ్ తనిఖీలు**

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బీడీ (బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్) టీమ్ అధికారులు వికారాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడైనా మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీస్ అధికారులు, డయల్ 100 గాని కాల్ చేసి తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

## నగదు పట్టివేత



పట్టుబడ్డ నగదు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

పరిగి టౌన్, మార్చి 23 : ఎవ్వరికీ అనుమానం రాకుండా గూడ్స్ వేహికిల్‌లో తరలిస్తున్న డబ్బును పట్టుకున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి పరిగి కోర్టు చౌరస్తాలో పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా టిఎస్12యుడి2647 గూడ్స్ వాహనంలో హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్ తీసుకెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేయగా సరైన సమాధానం చెప్పకుండా డబ్బుకు సరైన పత్రాలు చూపించకపోవడంతో రూ.6,54,660 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

## రైలుకిందపడి వ్యక్తి మృతి



తాండూరు, మార్చి 23: రైలుకిందపడి వ్యాపారి మృతి చెందిన ఘటన శనివారం తాండూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాత తాండూరుకు చెందిన అన్నదాత ఫెర్టిలైజర్ నిర్వాహకుడు శివకుమార్ ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతి చెందినట్లు తెలిపారు. గుర్తించిన పోలీసులు జిల్లా దవాఖానలో పోస్టుమార్టు చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962